సాక్షి నిర్మల్

శనివారం : 6 : ఏప్రిల్ : 2024



తప్పిన గజరాజు గండం

గజరాజు గండం ముగిసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేసిన ఏనుగు ఎట్టకేలకు ప్రాణహిత నది దాటింది. IIలో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్
శని : 6:32

సహర్
ఆది : 4:42

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
41.6 /28.7

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మంత్రి సీతక్కను కలిసిన టీజేఎస్ నేత



మంత్రి సీతక్కతో సర్దార్ వినోద్‌సింగ్

ముధోల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను టీజేఎస్ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌సింగ్ శుక్రవారం కలిశారు. టీజేఎస్ అధినేత కోదండరామ్‌తో కలిసి మంత్రిని కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం చర్చించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇందిర శోభన్, సామ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఫైజాన్‌అహ్మద్

కుంటాల: వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు గ్రామాల్లో చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. శుక్రవారం ఓలా గ్రామంలో పర్యటించారు. రూర్బన్ పథకం నిధులతో నిర్మించిన వ్యవసాయ గోదాం పరిశీలించారు. రైతులకు వినియోగపడే లాచర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీ నిర్వాణ బాగుందని ఏపీవో గట్టుపల్లి నవీన్‌ను అభినందించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీపీ ఆప్క గజ్జారాంయాదవ్, ఎంపీటీసీ కట్ట రవి, పీఆర్ డీఈ సురేశ్, ఎంపీడీవో అబ్దుల్ రహీం, పంచాయతీ కార్యదర్శి యోగేశ్ ఉన్నారు.

'స్పాట్'కు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయులకు నోటీసులు

నిర్మల్ రూరల్: పదో తరగతి స్పాట్ విధులకు హాజరుకాని 62 మంది ఉపాధ్యాయులకు డీఈవో రవీందర్‌రెడ్డి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో స్పాట్‌ను ప్రారంభించారు. జిల్లాలోని పలువురు ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు విధులను కేటాయించారు. కానీ అందులో 62 మంది విధులకు హాజరు కాలేదు. వీరందరికీ షోకాజ్ నోటీసులను జారీ చేశారు. శనివారం ఉదయం 9 గంటల లోపు స్పాట్ కేంద్రంలో హాజరు కావాలని, హాజరు కాకుంటే వారి వేతనం కూడా నిలిపివేస్తామని డీఈవో హెచ్చరించారు. జిల్లాకు 1.41 లక్షల జవాబు పత్రాలు వచ్చాయని తెలిపారు. ఈనెల 13 వరకు మూల్యాంకనం కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఆర్టీసీ కిక్కిరిసి..!



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలు పాట్లు పడుతున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచకపోవడంతో ఇబ్బంది నెలకొంటోంది. IIIలో ▸

ఫ్రై.. డే!



జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. వారం రోజులుగా నిప్పలు కురిపిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. శుక్రవారం దస్తురాబాద్‌లో 43.4, కడెంలో 43.3, కుభీర్, భైంసాలో 43.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఉదయం 10 గంటల నుంచే ఎండ వేడికి జనం బయటకు రావడంలేదు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనులపై బయటకు వస్తున్నవారు చాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాహనదారులు ఇలా టోపీలు, ముఖానికి కర్చీఫ్ కట్టుకుని, మహిళలు తలకు చేతి రుమాలు కట్టుకుని బయటకు రావడం కనిపించింది. ఇక పిల్లలు వేడికి శీతలపానీయాలు తాగుతూ కనిపించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

'ఉపాధి' జాతర



నర్సాపూర్‌జీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు

- రోజుకు 70 వేల మంది కూలీలు హాజరు
- గురువారం రికార్డు స్థాయిలో పనులకు..
- చెరువుల్లో జోరుగా తవ్వకాలు

జిలాల్లో ఇలా...

గ్రామ పంచాయతీలు	396
జిల్లాలో జాబ్ కార్డులు	1,74,147
పనులకు వచ్చే జాబ్‌కార్డుదారులు	1,37,813

నాలుగు రోజుల్లో కూలీల హాజరు..

తేదీ	కూలీల హాజరు
1	69,968
2	70,336
3	70,227
4	72,557

లోకేశ్వరం: వలసల నివారణకు కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తోంది. ఉన్న ఊళ్లోనే పని కల్పిస్తూ గిట్టుబాటు కూలి అందిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో ఇతర పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు కూలీలు తరలి వెళ్తున్నారు. ప్రతీరోజు సగటున 70 వేల మందికి పైగా హాజరవుతున్నారు. ఇటీవల కూలి పెంచడంతో పనులు జోరందుకున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండడంతో దూర ప్రాంతాల్లో చేసే పనులకు ట్రాక్టర్ల ద్వార కూలీలను తరలిస్తున్నారు. కొంత మంది కూలీలు సొంత వాహనాలపై వెళ్తున్నారు. ఇక ఎండ వేడి దృష్ట్యా అధికారులు పని వేళలు మార్చారు.

లక్ష్యాన్ని నిర్దేశించి...

అన్ని పల్లెల్లో ఉపాధి హామీ పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు. కేంద్రం గతంలో మాదిరిగా కాకుండా సాంకేతికత, నిబంధనలు కఠినతరం చేయడంతో గ్రామాల్లో పనుల సంఖ్య కాస్త తగ్గాయి. అయినా ఉన్నతాధికారులు గ్రామాల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతీ గ్రామం నుంచి 183 మంది కూలీలు వచ్చేలా లక్ష్యం విధించారు. ప్రస్తుతం సగటున 160 మంది వస్తున్నారు. ఇక ఈ పథకంలో 190 రకాల పనులు చేపట్టే అవకాశం ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1,83,770 పనిదినాల లక్ష్యం పూర్తిచేశారు. ఇందులో 1.83 లక్షల మంది కూలీలు భాగస్వాములయ్యారు.

జల సంరక్షణకు ప్రాధాన్యం ...

జిల్లా వ్యాప్తంగా జల సంరక్షణ పనులకు అధికారులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగా పీడర్ ఛానెల్ల ఏర్పాటు, చెరువుల్లో పూడిక తీయడం, కందకాలు తవ్వడం, సాగు నీటి కాలువల బాగు చేయడం వంటి పనులు చేపడుతున్నారు. వీటితోపాటు పొలాలకు దారి కల్పించే పనులు సాగిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 53.80 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఏప్రిల్ నెలలో 70 వేల మంది కూలీలు వస్తుండటం గమనార్హం. కూలి రూ.300లకు పెంచగా, ప్రస్తుతం సగటు కూలి రూ.183 అందుతుందని అధికారులు చేబుతున్నారు. ఎండ కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు నిర్వహించేంకునే వెసులుబాటు కల్పించారు.

కూలి సక్రమంగా చెల్లించాలి..



ఉపాధిహామీ పథకం పనులకు రోజూ వెళ్తున్నాం. చేసిన పనులకు కూలి సంక్రమంగా చెల్లించాలి. గతంలో నెలల తరబడి డబ్బులు వచ్చేవి కావు. చేసిన పనులు కొలతను తీసి డబ్బులను చెల్లించాలని కోరుతున్నాం.

– రాజేశ్వర్, వట్టోలి

అందరికీ పని కల్పిస్తాం



ప్రస్తుతం కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రస్తుతం కూలీల సంఖ్య పెరగగా, మరింత పెంచేందుకు కృషి చేస్తున్నాం. పనులు జరిగే చోట తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుతున్నాం.

– విజయలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

చి'వరి'కి నీరేది?



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కడెం మండలం పెద్దూర్‌తండాకు చెందిన రైతులు. కొద్ది రోజులుగా సదర్మాట్ కాలువ నీళ్లు రాకపోవడంతో ప్రతీరోజు రాత్రుళ్లు అడ్డుకట్టలు తొలగించి, నీటిని మళ్లించేందుకు ఎగువన కాలువల వెంట తిరుగుతున్నారు. ఇవీ సదర్మాట్ చివరి ఆయకట్టు రైతులు కష్టాలు.



నీరందక ఎండుతున్న వరి పొలం



నీరు లేక వెలవెలబోతున్న కాలువ

- నీరందక ఎండుతున్న పొలాలు
- ఆందోళనలో సదర్మాట్ రైతాంగం
- పట్టించుకోని నీటిపారుదల అధికారులు

కడెం: సదర్మాట్ చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండుతున్నాయి. యాసంగి పంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి సదర్మాట్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించడంతో వేల ఎకరాలు పంటలు సాగు చేశారు. కాలువలకు సక్రమంగా నీరందించాల్సిన ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పొట్ట దశకు చేరిన పంట తడారి నెర్రలు బారడంతో రైతులు పంటను కాపాడుకునేందుకు తండ్లాడుతున్నారు. కాలువ నీటి విషయమై సదర్మాట్ ఖానాపూర్ డీఈ సురేందర్‌ను వివరణ కోరగా మాకు సంబంధం లేదు.. అక్కడి అధికారులను అడగాలని చెప్పి తప్పించుకుంటున్నారు.

ఎండుతున్న పొలాలు..

సదర్మాట్ ఆయకట్టు కింద కడెం మండలం లింగాపూర్, ఎలగడప, సారంగపూర్, పాతమద్దిపడగ, కొత్తమద్దిపడగ, మాసాయిపేట్, నచ్చన్‌ఎల్లాపూర్, ధర్మాజీపేట్, పెద్దూర్, పెద్దూర్‌తండా, చిట్యాల్ గ్రామల్లోని 13 వేల ఎకరాల పంటలకు సాగు నీరు అందుతుంది. ఆశలతో వరి పంటలు సాగు చేసిన రైతులకు పంట చివరి దశలో సక్రమంగా, సరిపడా నీళ్లు రాక అందోళనలో పడ్డారు. సాగు నీటి కోసం రాత్రింబవళ్లు కష్టాలు పడుతున్నారు. పెద్దూర్‌తండా, వకీల్‌నగర్ తదితర గ్రామాల రైతులకు అడ్డుకట్టలు తొలగించి, నీటిని మళ్లిచేందుకు రాత్రిళ్లు కాలువ వెంట తిరుగూ ఇబ్బందులు పడుతున్నారు.

అడ్డుకట్ట వేస్తున్న ఎగువ రైతులు

సదర్మాట్ ఆయకట్టుకు ఎగువన ఉన్న వేములకుర్తి, ఇబ్రహీంపట్నం తదితర గ్రామలకు చెందిన రైతులు గోదావరి నీటికి అడ్డుకట్టలు వేయడంతో సదర్మాట్‌కు వచ్చే నీళ్లలో అంతరాయం కలుగుతుంది. కడెం మండలం లింగాపూర్, మద్దిపడగ, వకీల్‌నగర్, పెద్దూర్‌తండా తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులు వేసిన అడ్డుకట్టలను తొలగించిన తిరిగి మరలా ఆయా గ్రామాల రైతులు అడ్డకట్ట వేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చివరి ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలు పండేనా?

సదర్మాట్ ఆయకట్టు కింద ప్రధానంగా వరి, మొక్కజొన్న, నువ్వులు పండిస్తారు. సదర్మాట్ కాలువకు 500 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా, ప్రస్తుతం చివరి ఆయకట్టుకు చుక్క నీరందని పరిస్థితి నెలకొంది. కడెం మండలానికి ఫిబ్రవరిలో కాలువ నీరు విడుదల చేయడంతో పంటలు ఆలస్యమయ్యాయి. మరో నెల రోజులపాటు సుమారు ఒక టీఎంసీ నీరందిస్తేనే పంటలు పండే పరిస్థితి ఉంది. లేదంటే మొత్తం ఎండిపోయే పరిస్థితి.

ఇబ్బందులు పడుతున్నాం



సదర్మాట్ కాలువ కింద రెండు ఎకరాలు వరి వేశా. ఎగువన ఉన్న రైతులు గోదావరికి అడ్డుకట్టలు వేయడంతో కాలువ నీరు రావడం లేదు. నీటి కోసం ప్రతీరోజు కొందరు రైతులం రాత్రిళ్లు కాలువల వెంట తిరుగుత్నుం.

– సురేందర్, రైతు, పెద్దూర్‌తండా

పంట ఎండుతుంది



సదర్మాట్ కాలువ కింద నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశా. గత కొద్ది రోజులుగా కాలువ నీరందక ఇబ్బందులు పడుతున్నాం. సాగు నీరందక పంట తడారిపోతుంది. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే నీరందేలా చర్యలు తీసుకోవాలి.

– వేణుగోపాల్, రైతు, పెద్దూర్‌తండా

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: మాజీ ఉప ప్రధాని, బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్ హాజరయ్యారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో రాజేశ్వర్, డీఆర్వో భుజంగరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెలిమల ప్రభాకర్ అన్నారు. టీఎన్జీవోస్ యూనియన్ సంఘ భవనంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ భారత ఉపప్రధాని, కార్మిక శాఖ మంత్రి, రక్షణ శాఖ మంత్రిగా దేశానికి సేవలు అందించారని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సహాధ్యక్షుడు శ్రీరామ్ శ్రీనివాస్, నాయకులు ఎస్.మోహన్‌రెడ్డి, ఎం.గంగాధర్, యోగేష్, డి.రాములు, ఎస్.రాజన్న, ఎస్.సుధాకర్ పాల్గొన్నారు.

అల్లోల.. డైలమా..!

- కాంగ్రెస్‌లో చేరికపై కొనసాగుతున్న సస్పెన్స్
- క్లారిటీ ఇవ్వని మాజీ మంత్రి



అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్: మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరికపై సస్పెన్స్ కొనసాగుతోంది. తన సుదీర్ఘ రాజకీయ అనుభవంలో తొలిసారి అనిశ్చితి కనిపిస్తోంది. గులాబీ పార్టీ నుంచి పాతగూటికి చేరుతారా.. లేదా..! అనే విషయంలో డైలామా కొనసాగుతూనే ఉంది. నెలరోజులుగా ఎన్నో తేదీలు మారుతూ వచ్చాయి. చివరకు ఈనెల 6న తుక్కుగూడ బహిరంగసభలో ఆయన కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని ప్రచారం జరిగింది. దీనిపైనా శుక్రవారం సాయంత్రం వరకూ క్లారిటీ లేదు. ఆయన అనుచరుల్లోనూ కొంతమంది చేరుతారని, మరికొందరు ఇప్పుడు కాదని తర్వాత పార్టీలోకి వెళ్తారని చెబుతున్నారు. మరోవైపు తమ పార్టీలోకి అసలు.. ఆయనకు ఎంట్రీయే లేదని కాంగ్రెస్‌లోని కొన్నిశ్రేణులు పేర్కొంటున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, కాంగ్రెస్ అధికారంలోకి రావడం వంటి పరిణామాలు జిల్లా రాజకీయాలనూ మార్చేస్తున్నాయి. కారు పార్టీకి జిల్లాలో ఘోరపరాభవం ఎదురైంది. నిర్మల్‌లో మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న విఠల్‌రెడ్డి, ఖానాపూర్‌లో కేటీఆర్ మిత్రుడైన జాన్సన్‌నాయక్ ముగ్గురూ ఓటమిని మూటగట్టుకున్నారు. అటు రాష్ట్రంలో, ఇటు జిల్లాలో కారు కనిపించకుండా పోవడంతో గులాబీశ్రేణులతోపాటు నేతల్లోనూ కలవరం మొదలైంది. రాజకీయంగా తమ భవిష్యత్తు తాము చూసుకోవాలన్న ధోరణిలో అధికార కాంగ్రెస్‌లోకి వలసలు మొదలుపెట్టారు.

'కారు' మొత్తం ఖాళీ..

జిల్లాలో ఇప్పటికే భారీసంఖ్యలో ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌ను వీడుతున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితోనే దాదాపు కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ వలసలు మొదలయ్యాయి. జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ అధ్యక్షుడు ఎర్రవోతు రాజేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, పలువురు జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా శుక్రవారం సాయంత్రం నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గంగాధర్ తదితరులూ బీఆర్ఎస్‌నూ వీడారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

చేరికపై ఉత్కంఠ

ఇప్పటికే మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అనుచరులు, రాజకీయశిష్యులు, తన వెంట ఉన్న సీనియర్లందరూ ఒక్కొక్కరుగా తనను వీడి, కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరూ రేపోమాపో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలోనూ 'అల్లోల' కాంగ్రెస్‌లో చేరికపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. ఈనెల 6న పార్టీ మారడం ఖాయమంటూ వారం నుంచి అనుచరులు ప్రచారం చేస్తూ వచ్చారు. ఇంద్రకరణ్‌రెడ్డి కూడా సమర్థిస్తూ వచ్చారు. కానీ శుక్రవారం సాయంత్రం వరకూ స్పష్టత రాలేదు.

సీఎంకు రైతులపై ప్రేమ లేదు

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- జిల్లా కేంద్రంలో బీజేపీ రైతు సత్యాగ్రహదీక్ష



సత్యాగ్రహ దీక్షలో నాయకులు, రైతులు

నిర్మల్‌చైన్‌గేట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయాలపై ఉన్న ప్రేమ, రైతులపై లేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కార్‌కు ముందుచూపు లేకపోవడంతోనే పంటలు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా సాగునీరు, విద్యుత్ సరఫరా విషయంలో నిర్లక్ష్యం చేశారన్నారు. ఎన్నికల సమయంలో అన్నదాతలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, పంటకు రూ.500 బోనస్, రూ.15 వేల రైతు భరోసా సాయం కౌలు రైతులకు రూ.12 వేల సాయం కలగానే మిగిలిందన్నారు. సాగు నీరు లేదు, సబ్సిడీలు లేవన్నారు. పంటలు ఎండిపోతే పరిహారం ఇచ్చే దిక్కు లేదని వెంటనే పంట నష్టపోయిన రైతులకు సాయం అందించాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీల విషయంలో అన్నదాతలకు క్షమాపణ చెప్పాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాకే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి రావాలన్నారు. లేకుంటే ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ నేతలను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తామన్నారు. కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, అయ్యన్నగారి భూమయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

మిగులు పనులు పూర్తి చేయాలి

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం వద్ద నిర్మిస్తున్న గోదాం మిగులు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి గోదాంను శుక్రవారం తనిఖీ చేశారు. వేయింగ్ మెషీన్ ఇతర పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వీలైనంత త్వరగా రైతులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ ఉన్నారు.




పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ అశిష్ సంగ్వాన్

తప్పిన గజరాజు గండం

- ఎట్టకేలకు ప్రాణహిత నది దాటిన ఏనుగు
- పెంచికల్‌పేట్ మండలంలో 36 గంటలపాటు సాగిన సెర్చ్ ఆపరేషన్
- డ్రోన్‌ల సహాయంతో ప్రత్యేక బృందాల గాలింపు
- ఫలించిన అటవీశాఖ అధికారుల కృషి
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు


డ్రోన్ సిద్ధం చేసుకుంటున్న సభ్యుడు


డ్రోన్‌ల ద్వారా గాలిస్తున్న ప్రత్యేక బృందాలు


మురళీగూడ రహదారి వద్ద ఏనుగు

పెంచికల్‌పేట్(సిర్పూర్): గజరాజు గండం ముగిసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన ఏనుగు ఎట్టకేలకు ప్రాణహిత నది దాటింది. శుక్రవారం నుంచి పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాం, జిల్లెడ, మురళీగూడ గ్రామ సమీపంలో ఏనుగును గుర్తించి అటవీశాఖ అధికారులు, ప్రత్యేక బృందాలు, పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించారు. ఫలితంగా ఏనుగు రాత్రి 7.30 గంటల ప్రాంతంలో మురళీగూడ వద్ద ప్రాణహిత నది దాటి మహారాష్ట్ర అడవుల్లోకి ప్రవేశించింది. పెంచికల్‌పేట్ మండలంలో 36 గంటలపాటు కొనసాగిన గజరాజు సెర్చ్ ఆపరేషన్ ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బూరెపల్లి టు మురళీగూడ

ఈ నెల 3న మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది దాటి వచ్చిన ఏనుగు బూరెపల్లి గ్రామ శివారులో పంట చేనులో అల్లూరి శంకర్‌పై ఒక్కసారిగా దాడి చేసి హతమార్చింది. అక్కడి నుంచి ఖర్జెల్లి, రుద్రాపూర్, సులుగుపల్లి గ్రామాల మీదుగా పెంచికల్‌పేట్ మండలంలోకి ప్రవేశించింది. ఈ నెల 4న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామ సమీపంలోకి వచ్చింది. అక్కడ తెల్లవారుజామున వరి పొలానికి నీటిని అందించేందుకు వెళ్తున్న కారు పోశన్నను తొక్కి చంపింది. ఇద్దరు రైతులు ఏనుగు దాడిలో మృత్యువాత పడటంతో అటవీశాఖ అధికారులు చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. 144 సెక్షన్ విధించి ప్రజలను అప్రమత్తం చేశారు.

కమ్మర్‌గాంలో ప్రత్యక్షం

లోడుపల్లి వద్ద సంచరించిన ఏనుగు శుక్రవారం ఉదయం కమ్మర్‌గాం గ్రామ సమీపంలోని పల్లె ప్రకృతి వనం వద్ద ప్రత్యక్షమైంది. దానిని చూసిన గ్రామస్తులు హడలిపోయి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. లోడుపల్లి, మెరెగూడ నుంచి అటవీప్రాంతం నుంచి గుండెపల్లి మీదుగా కమ్మర్‌గాం చేరుకున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ప్రత్యేక బృందాలు డ్రోన్‌ల సహాయంలో మురళీగూడ మునలమ్మ గుట్టపై తిరుగుతున్నట్లు గుర్తించారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మురళీగూడ నుంచి కమ్మర్‌గాం వస్తున్న ఆటోకు ఎదురురావడంతో అందులోని ప్రయాణికులు, డ్రైవర్ ఆటో వదిలేసి పారిపోయారు. ప్రత్యక్ష సాక్షుల సహాయంతో అధికారులు ఏనుగు పాదాల గుర్తులను పరిశీలిస్తూ జిల్లెడ గ్రామ సమీపంలోకి చేరుకున్నారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో మురళీగూడ సమీపంలోని పాలకుంట వద్ద ఏనుగును అధికారులు గుర్తించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలతోపాటు స్థానిక అటవీశాఖ అధికారులు, పోలీసులు సమన్వయంతో ఏనుగును సురక్షితంగా ప్రాణహిత నదిని దాటించటానికి ప్రణాళికలు రూపొందించారు. దానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ సుమారు 14 గంటల పాటు కమ్మర్‌గాం నుంచి మురళీగూడ వరకు ఈ ఏనుగు అనుసరించారు. రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో మురళీగూడ వద్ద ప్రాణహిత నది దాటి మహారాష్ట్రలోని చిన్నవట్ర అటవీ ప్రాంతంలోకి ఏనుగు వెళ్లిపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

గ్రామాల్లో భయం భయం

ఏనుగు సంచారంతో మూడు రోజులపాటు చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, కౌటాల, దహెగాం మండలాల ప్రజలు భయం భయంగా గడిపారు. పంట చేలు, రోడ్లపై తిరుగుతుండటంతో గిరిజన గ్రామాల్లో బయటికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. చివరికి ఏనుగు నది తీరం దాటి పోయిందని అధికారులు నిర్ధారించడంతో సరిహద్దులోని గిరిజన గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఏనుగును గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి డ్రోన్‌ల సహాయంలో గాలింపు ముమ్మరం చేశారు. కొండపల్లిలో రైతును హతమార్చిన అనంతరం ప్రత్యేక బృందాలు డ్రోన్‌ల సహాయంతో గాలించినా గురువారం ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. మళ్లీ రాత్రి ఎనిమిది గంటల తర్వాత లోడుపల్లి- పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై కొండపల్లి టర్నింగ్ వద్ద ఆర్టీసీ బస్సుకు ఎదురైంది. రాత్రిపూట గజరాజు కదలికలను గుర్తించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ఇద్దరి ప్రాణాలు పోయాయి



వన్యప్రాణుల దాడులతో భయం భయంగా గడుపుతున్నాం. ఇప్పటికే కొండపల్లి గ్రామంలో పెద్దపులి, ఏనుగు దాడుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వన్యప్రాణుల దాడుల సమయంలో హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఇకనైనా ప్రజల రక్షణకు చర్యలు చేపట్టాలి.

– మెంగబోయిన పోశన్న, కొండపల్లి, మం.పెంచికల్‌పేట్

బైక్ వదిలేసి పరుగెత్తాం



గురువారం రాత్రి సలుగుపల్లి నుంచి పెంచికల్‌పేట్ వస్తుండగా లోడుపల్లి అటవీ ప్రాంతంలో ఏనుగు ఎదురైంది. భయంతో బైక్ వదిలేసి వెనక్కి పరుగెత్తాం. ఆర్టీసీ బస్సు ఎదురుకావడంతో ఏనుగు వెళ్లిపోయింది. ప్రయాణికుల సాయంతో బైక్ తీసుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పెంచికల్‌పేట్ చేరుకున్నాం.

– దోశ రవి, పెంచికల్‌పేట్

రూ.50లక్షల పరిహారం చెల్లించాలి



అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి. గతంలో పెద్దపులి దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు కేవలం రూ.5 లక్షలు చెల్లించి చేతులు దులుపుకున్నారు. బాధిత కుటుంబాల్లో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.

– కోట సతీశ్, మురళీగూడ మం.పెంచికల్‌పేట్

క్లుప్తంగా

బాసరలో నగర సంకీర్తన


సంకీర్తన చేస్తున్న సంఘం సభ్యులు

భైంసా: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో పూర్వకాలంలో చేసినట్లు సంకీర్తన కార్యక్రమాన్ని ప్రతీగ్రామంలో కొనసాగిస్తామని వ్యాసపురి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పూజారి వెంకటేశ్ తెలిపారు. బాసరలో శుక్రవారం నగర సంకీర్తన నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా హరిజనవాడ మారెమ్మ ఆలయం నుంచి ప్రారంభించారు. లోకకల్యాణార్థం చేపట్టిన కార్యక్రమంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. దైవస్మరణ, ధర్మ పరిరక్షణ, సమాజంలో ఐకమత్యం కోసం సంకీర్తనలో అందరూ పాల్గొనాలని వారు పేర్కొన్నారు.

కారు బోల్తా


ప్రమాదానికి గురైన కారు

భైంసా: బాసర సమీపంలో భైంసా-నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన శుక్రవారం కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు పల్టీలు కొట్టి రోడ్డుపక్కన పడిపోయింది. ఇందులో ప్రయాణిస్తున్న మహారాష్ట్రవాసులకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

గుడుంబా పట్టివేత

సారంగపూర్: మండలంలోని సాయినగర్‌తండాలో శుక్రవారం గుడుంబా స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతో ఏఎస్సై వసంత్, హెడ్‌కానిస్టేబుల్ సూర్యంత్, మహిళా కానిస్టేబుల్ అష్మ కలిసి గ్రామంలో దాడి చేసి ఒకరిని పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద 11 లీటర్ల గుడుంబా లభ్యమైందని ఎస్సై చంద్రమోహన్ పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గుడుంబాను పోలీసుస్టేషన్ తరలించి, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారి వద్ద సీఐ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. పోచంపల్లి రఘునందన్ నిర్మల్ నుంచి పీచర వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా రూ.1.44 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఎస్సై నారాయణరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, పీసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ వద్ద శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ. 3.20 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ తాలూకా నాకా గ్రామానికి చెందిన అరుణ్ కలామ్ ఖురేషి తన కారులో వెళ్తుండగా తనిఖీ చేశామన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.3.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

గంజాయి విక్రయదారుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం పట్టుకున్నామని టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానం రావడంతో ఖానాపూర్‌కు చెందిన షాబాజ్‌ఖాన్‌ను తనిఖీ చేయగా 70 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభ్యమైనట్లు పేర్కొన్నారు. ఆయన్ను అరెస్టు చేసి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి


స్వర్ణలత(ఫైల్)

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని జీఎన్‌ఆర్ కాలనీకి చెందిన స్వర్ణలత వడదెబ్బతో మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణలత (45)గత రెండు రోజుల క్రితం బంధువుల వివాహానికి నిజామాబాద్‌కు వెళ్లింది. ఎండల తీవ్రత కారణంగా ఆమెకు వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురైంది. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. స్వర్ణలత భర్త గంగా ధర్ ప్రభుత్వ ఉద్యోగి. వీరికి ముగ్గురు కుమార్తెలు ప్రత్యూయది ఇటీవలే పదో తరగతి పూర్తయింది. జయంతిక 8వ తరగతి చదువుతోంది. వైష్ణవి 2వ తరగతి చదువుతోంది. ముగ్గురు పిల్లలు తల్లిలేనివారయ్యారు. స్వర్ణలత మృతదేహంపై పడి 'అమ్మ లే అంటూ..' ఏడవడం అందరినీ కదిలించింది.

యువకుడి మృతి


సాయికుమార్ (ఫైల్)

బోథ్(నేరడిగొండ): బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన యువకుడు సాయికుమార్ (21) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ రోజువారి కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం అతడు గ్రామంలోని ఓ శుభకార్యానికి వెళ్లాడు. నీరు తాగిన వెంటనే అక్కడికక్కడే పడిపోయాడు. గమనించిన స్థానికులు బోథ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యన మృతిచెందాడు. యువకుడి మృతితో గ్రామంలో విషాయఛాయలు అలుముకున్నాయి.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


పార్టీలో చేరిన వారితో గోడం నగేశ్

- ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. మండలంలోని ధార్మిక్‌నగర్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నారాయణపూర్ తాజా మాజీ సర్పంచ్ జాదవ్ పరశురాం, వాంకిడి ఎంపీటీసీ సుజాత బలరాం జాదవ్‌లు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా గోడం నగేశ్ మాట్లాడుతూ వరుస చేరికలతో పార్టీ రోజురోజుకు బలంగా మారుతుందన్నారు. దేశవ్యాప్తంగా అన్నివర్గాల వారు ముక్తకంఠంతో కోరుతున్న పేరు నరేంద్ర మోదీ అని అన్నారు. అందరు సమష్టిగా పనిచేసి విజయం సాధిద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, పార్టీ నాయకులు బాబారావ్ పటేల్, తాంసి జెడ్పీటీసీ రాజు, బోథ్ ఏఎంసీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ సింగ్, మాజీ ఎంపీపీ సాబ్లే ప్రేమ్ సింగ్, మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, సాబ్లే సంతోష్ సింగ్, తాజా మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బెల్టుషాపుపై దాడి


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఎదులాపురం: పట్టణంలోని సంజయ్‌నగర్‌లోని బెల్టుషాపుపై టూటౌన్ పోలీసులు శుక్రవారం దాడి నిర్వహించారు. పక్కా సమాచారంతోనే బెల్ట్‌షాపుపై దాడి చేసి అక్రమ మద్యం విక్రయిస్తున్న అదే కాలనీకి చెందిన గణపతి మధుకర్ రాజ్ పట్టుకున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. అతని వద్ద నుంచి రూ.14 వేల విలువ చేసే 18 లీటర్ల 300 ఎంఎల్ అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై లాల్‌సింగ్ నాయక్, పోలీసు సిబ్బంది కిషన్, నరేశ్, హరీంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

బ్యాంకు ఖాతాను ఖాళీ చేసిన సైబర్ నేరగాళ్లు

ఆదిలాబాద్‌టౌన్: సైబర్‌నేరగాళ్లు ఏకంగా ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులను ఖాళీ చేశారు. పట్టణంలోని గంజ్‌రోడ్‌కు చెందిన మహెబూబ్‌ఖాన్ బ్యాంకు అకౌంట్‌ను హ్యాక్ చేశారు. గతనెల 22 నుంచి 26వ తేదీ వరకు ఆయన ఖాతాలో రూ.2లక్షల 40వేలు నగదును దోచుకున్నారు. ధనలక్ష్మి లాడ్జి సమీపంలోని ఎస్బీఐలో ఆయన ఖాతా ఉంది. ఈనెల 27న డబ్బులు డ్రా చేసుకునేందుకు బ్యాంక్‌కు వెళ్లగా అకౌంట్ ఖాళీగా ఉండడంతో ఒక్కసారిగా ఖంగుతిన్నాడు. శుక్రవారం బాధితుడు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణారెడ్డి వివరించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

దండేపల్లి: మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన రెండు చోరీ కేసులను పోలీసుల గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి ఎస్సై స్వరూప్‌రాజ్ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని శ్రీమాల్గాం మల్లన్న ఆలయంలో హుండీ డబ్బులతో పాటు వెండి ప్రతిమలు, గ్రామానికి చెందిన షేక్ హాజీ ట్రాలీ ఆటో బుధవారం రాత్రి చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం గూడెం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, ట్రాలీ ఆటోతో వచ్చిన తూర్పాటి కనకయ్య, పత్తి కనకరాజు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకుని విచారించగా, దండేపల్లిలో బుధవారం రాత్రి తామే చోరీలకు పాల్పడ్డట్లు ఒప్పుకొన్నారు. దీంతో వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారు ఎత్తుకెళ్లిన ట్రాలీ ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నారు.

సెలవు రోజుల్లోనూ విధులు

- తాగునీటి ఎద్దడిపై ఆరా


కార్యదర్శులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకుంటున్న డీపీవో

కైలాస్‌నగర్: జిల్లా పంచాయతీ అధికారులు సెలవు రోజు సైతం విధులను నిర్వహించారు. జిల్లాలో ఎండల తీవ్రత దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఫలితంగా పలు గ్రామాల్లో ఇప్పటికే నీటిఎద్దడి తలెత్తి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితి లేకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో డీపీవో శ్రీలత, డీఎల్‌పీవో ఫణీందర్‌రావు శుక్రవారం సెలవు రోజైన సాయంత్రం వరకు విధులు నిర్వహించారు. నీటి సమస్య ఉన్న పలువురు పంచాయతీ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి అక్కడి పరిస్థితిపై ఆరా తీశారు. నీటిఎద్దడి సమస్యపై పత్రికల్లో ప్రచురితమైన కథనాలు ప్రస్తావిస్తూ ప్రస్తుతం అక్కడ చేపట్టిన చర్యలపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్య తీవ్రంగా ఉన్నట్లెతై తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పైపులైన్ లీకేజీలు, మోటర్ల మరమ్మతును వెంటనే పరిష్కరించాలన్నారు.

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ, అధ్యాపకులు

భైంసా: అణగారినవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్‌ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ అన్నారు. క్యాంపస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవిత చరిత్రను విద్యార్థులు తెలుసుకుని, జీవితంలో రాణించాలన్నారు. సంస్కరణల కోసం పదవులు త్యాగం చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించినందుకు ఎస్సీ,ఎస్టీ సెల్ కన్వీనర్ డాక్టర్ విఠల్, కోకన్వీనర్ వసంత్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ వినోద్, శ్రీశైలం, రంజిత్‌కుమార్, డాక్టర్ విజయకుమార్, ప్రకాశ్, ఎస్సీ, ఎస్టీ సెల్ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఎదులాపురం: పట్టణంలో మట్కా స్థావరంపై టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడి చేసి నిర్వాహకుడిని అరెస్టు చేశారు. స్థానిక ఖుర్షీద్‌నగర్‌కు చెందిన లతీఫ్ ఆధ్వర్యంలో అదే కాలనీకి చెందిన షేక్ యూనుస్ మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి మట్కా నిర్వాహకుడు యూనుస్‌ను పట్టుకున్నామని టూటౌన్ ఎస్సై తెలిపారు. అతని నుంచి ఐదు మట్కా చిట్టీలు, రూ.2880 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాసరలో భక్తుల రద్దీ


పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు

భైంసా: బాసర ఆలయం శుక్రవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారికి ఇష్టమైనవారం, సెలవుదినం కలిసిరావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, ఒడ్డున ఉన్న శివాలయంలో పూజలు చేశారు. అక్కడి నుంచి జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి చేరుకుని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆలయంలో పూజలు..

బాసర సరస్వతీ అమ్మవారిని జిల్లావాసి, రాష్ట్ర ప్రణాళిక శాఖ సంయుక్త కార్యదర్శి శివలింగయ్య శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయన తన కుమారుడు రుత్విక్‌కు అక్షరాభ్యాసం చేయించి, ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ మావోయిస్టుకు రివార్డు


అరుణ, సట్వాజీ దంపతులకు చెక్కు అందిస్తున్న ఐజీ సుమతి

నిర్మల్: జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టుల సంక్షేమానికి సహకరిస్తామని ఇంటలిజెన్స్ ఐజీ సుమతి తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన మాజీ మావోయిస్టు వైదుగుల అరుణకు రూ.10 లక్షల రివార్డును హైదరాబాద్‌లో గురువారం అందించారు. అరుణ, సట్వాజీ దంపతులకు తన కార్యాలయంలో ఈ రివార్డుకు సంబంధించిన చెక్కును అందజేశారు.

2019లో లొంగిపోయి..

మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడిగా చేసిన సట్వాజీ, జార్ఖండ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా చేసిన అరుణ వీరిద్దరూ 2019లో జనజీవన స్రవంతిలోకి వచ్చారు. అప్పట్లో అరుణపై ప్రకటించిన రివార్డును ఇన్నేళ్ల తర్వాత పోలీసుశాఖ అందజేసింది. అరుణ, సట్వాజీ దంపతులు తమ కుమార్తెతో కలిసి ఈ రివార్డును అందుకున్నారు.

తాటిముంజలకు భలే గిరాకీ



వేసవి తాపాన్ని తీర్చేందుకు శరీరంలో చల్లదనాన్ని అందించేందుకు తాటిముంజలను ఎక్కువగా తీసుకుంటారు. పల్లెటూరి నుంచి పలువురు తాటిముంజలను జిల్లా కేంద్రానికి తెచ్చి విక్రయిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, చెట్ల నీడన వద్ద డజన్‌కు రూ.100 విక్రయిస్తుండగా జనం కొంటున్నారు. వేసవి సీజన్‌లో వీటికి భలే గిరాకీ ఉంటుందని పలువురు చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



